మద్రాసు నుంచి వచ్చి ఆగిన ఎక్స్‌ప్రెస్ రైలులోనుంచి దిగి స్టేషన్ బయటకు వచ్చాడు రాజమోహన్. రోడ్డుమీదకు వచ్చిన తరువాత ఒకతను టైమ్ అడిగాడు.


వీధి దీపం వెలుతురులో గడియారాన్ని చూసి, పదకొండు గంటలు కావస్తోందని చెప్పి, నడక వేగాన్ని పెంచాడు రాజమోహన్. అప్పుడు అంత టైమ్ అయివుంటుందని అనుకోలేదు అతను.

రైలుస్టేషన్‌కి దగ్గరలోనే వున్న బస్టాండ్ వైపు గబగబా నడిచాడు.

అతను వెళ్లేసరికి బస్టాండు నిర్మానుష్యంగా వుంది. అక్కడక్కడా కొన్ని నైట్‌హాల్ట్ బస్‌లు ఆగివున్నాయి.

అక్కడే నిలబడి చేతిలో వున్న బ్యాగ్‌ని భుజానికి తగిలించుకుని, అక్కడకు అరవై కిలోమీటర్ల దూరంలో వున్న తన వూరికి ఎలా వెళ్లాలాని ఆలోచిస్తూ వుండిపోయాడు కొంచెంసేపు.

తన వూరికి వెళ్లే ఆఖరి బస్సు కూడా వెళ్లిపోయి వుంటుంది. ఇక తనకు వున్నది ఒక్కటే



# దాచుకునే స్నేహితులు

దారి. సెంటర్ వరకూ వెళితే ఏదయినా లారీ ఎక్కి తన వూరికి వెళ్లవచ్చు. హైదరాబాద్ వెళ్లే లారీలు తన వూరినించే వెళతాయి. గుంటూరు వైపు వెళ్లే లారీ ఎక్కితే తన వూరికి ఓ ఇరవై కిలోమీటర్ల ఇవతల ఓ టవున్లో దిగవచ్చు.

అతను ఇలా ఆలోచించి, అంత సేఫ్టీ కాక పోయినా లారీ ఎక్కి ఎలాగో ఇల్లు చేరటానికే నిర్ణయించుకున్నాడు చివరకు. రాత్రికి ఇల్లు చేరితే మర్నాడు ఆఫీస్‌కి వెళ్లవచ్చు.

రాజమోహన్ మూడురోజుల క్రితం మధు రైకి వెళ్లాడు. అక్కడ తను పనిచేస్తున్న కంపెనీ ఉద్యోగుల, కస్టమర్ల సమావేశంలో పాల్గొని తిరిగి వస్తున్నాడు.

యేడాది క్రితం రాజమోహన్ అతను వుంటున్న టవున్‌కి కొంతదూరంలో వున్న ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఆ కంపెనీకి భారతదేశంలో అన్ని రాష్ట్రాల లోనూ బ్రాంచీలు వున్నాయి. దక్షిణాది రాష్ట్రా లలో వున్న కస్టమర్ల సమావేశం మధురైలో ఏర్పాటు చేసి, కంపెనీ నూతన ఉత్పత్తుల గురించి, క్రెడిట్ పాలసీ గురించీ వాళ్లకు వివరంగా తెలియజేయడానికి కంపెనీ ప్రధాన కార్యాలయ ఉద్యోగిగా, కంపెనీ ప్రతినిధిగా రాజమోహన్‌ని మధురైకి పంపించారు. అలా మధురైకి వెళ్లిన రాజమోహన్ తన పని ముగిం చుకుని తిరిగి వస్తూ ఆ రాత్రివేళ అక్కడ చిక్కు బడిపోయాడు.

సెంటర్లో ఓ ఇరవై నిమిషాలు ఎదురు చూసిన తరువాత గుంటూరు వైపుకు వెళ్లే లారీ ఒకటి ఖాళీగా వచ్చింది. రాజమోహన్ అందు లో ఎక్కాడు. లోడు లారీ భారంగా వుంది. భారంగా వున్నా వేగంగా ప్రయాణించి, రాత్రి ఒంటిగంట దాటుతున్నపుడు రాజమోహన్ దిగాలనుకున్న టవున్‌లో ఆగింది. అక్కడకు అతను వుంటున్న వూరు ఓ ఇరవై కిలోమీటర్ల దూరంలో వుంది. ఆ వూర్లో అతనికి దూరపు బంధువులు వున్నారు. ఆ రాత్రికి వాళ్లింటికి వెళ్తే తెల్లవారి ఇల్లు చేరవచ్చనుకున్నాడు.

ఆ టైమ్‌లో అతనికి ఒక్క రిక్షా కూడా కనబడలేదు. నడిచి వెళ్లక తప్పక రోడ్డుమీద నడక సాగించాడు.

ఓ ఐదునిమిషాలు నడిచిన తరువాత వెనుకనించి ఓ పోలీసు జీపు వచ్చి అతని పక్కనే ఆగింది. అందులో నుంచి ఇద్దరు పోలీసులు దిగి అతన్ని ఆపుచేసారు.

'ఎవర్నువ్వు?' ఇద్దరిలో లావుగా, పొడుగ్గా వుండి బానపొట్ట వున్న ఓ కానిస్టేబుల్ రాజ మోహన్‌ని అడిగాడు.

'నా పేరు రాజమోహన్' చెప్పాడతను.

'నువ్వు సియం అనుకుంటున్నావా? పేరు

**ప్రతాప రవిశంకర్**

చెబితే తెలీడానికి?... ఇంత రాత్రివేళ ఎక్కడ్నించి వస్తున్నావ్?' పొట్టిగా డ్రమ్ములా వున్న రెండో కానిస్టేబుల్ పరిహాసంగా అన్నాడు.

తను ఎక్కడినుంచి వస్తున్నాడో చెప్పి, అప్పుడే తను లారీలోనుంచి దిగిన విషయాన్ని చెప్పాడు రాజమోహన్.

'వాడితో మాటలేంట్రా? జీపులోకి నెట్టండి. స్టేషన్లో చూసుకుందాం' జీపులోనుంచి ఎవడో పెద్దగా అరిచాడు అసహనంగా. బాగా తాగి వున్నాడేమో వాడి మాటలు ముద్దగా వున్నాయి.

'జీపెక్కరా...' మొదటివాడు రాజమోహన్ మెడమీద చెయ్యివేసి, జీపువైపు నెట్టాడు.

'కొంచెం మర్యాదగా ప్రవర్తించండి సార్' అన్నాడు రాజమోహన్.

'మర్యాద స్టేషన్లో ఇస్తాం... రా... పద' అంటూ వాడు రాజమోహన్ని బలవంతంగా జీపులోకి నెట్టాడు.

జీపు కదిలింది.

తను ఎక్కడ పనిచేస్తున్నాడో, ఎటువంటి పరిస్థితుల్లో అక్కడ దిగాడో వాళ్లకు వివరంగా చెప్పాడతను స్టేషన్కు వెళ్లేలోపల.

మందుకొట్టిన పోలీసు ఉద్యోగి మొత్తం విన్న తర్వాత పెద్దగా నవ్వి 'స్టోరీ బావుందిరా' అన్నాడు.

'స్టోరీ కాదు... నిజం. నేను ప్రూవ్ చేసుకుంటాను' చెప్పాడు రాజమోహన్.

'అంత ఛాన్స్ నీకు లేదు. స్టేషన్లో మా సి.ఐ. దొరగారి చేతిలో పడితే అంతా ఆయనే చూసుకుంటాడు. నీ స్టోరీలు అక్కడ చెప్పు' మళ్లీ అతనే అన్నాడు. చవకబారు విస్కీ వాసన గుప్పున కొడుతోంది అతను మాట్లాడినప్పుడల్లా.

స్టేషన్ ముందు ఆగింది జీపు.

వాళ్లంతా రాజమోహన్ని స్టేషన్లోకి నెట్టుకువెళ్లారు. తను లోపలకు నడుస్తున్నా వాళ్లు తనని ఎందుకు నెట్టుకువెళ్తున్నారో అతనికి అర్థంకాలేదు. తనని ఇవతలకు లాగి, వాళ్లందరిమీదా ఎవరైనా బాంబు విసిరితే బావుండుననిపించింది ఆ క్షణంలో.

లోపలకు వెళ్లిన తర్వాత రాజమోహన్ని సి.ఐ. దొరగారి ముందు హాజరుపరిచారు.

సి.ఐ. విలాసంగా సిగరెట్ కాలుస్తూ – 'ఎవడు వీడు?' అడిగాడు.

'చెప్పురా?' అన్నాడు బానపొట్ట కానిస్టేబుల్ రాజమోహన్ని వీపుమీద పొడిచి.

'కొంచెం మర్యాదగా మాట్లాడండి సార్. నేనూ మీలాంటి ఉద్యోగినే. నేరస్తుడిని కాదు' అన్నాడు రాజమోహన్.


'మర్యాద కావాలిరా...' అంటూ సి.ఐ. రాజమోహన్ని చెంపమీద ఈడ్చికొట్టాడు.

అంతా పెద్దగా నవ్వారు... సి.ఐ. దొరగారి చర్యను పొగుడుతున్నట్లు.

'నేను చేసిన నేరం ఏమిటి?' కొంచెం ధైర్యం తెచ్చుకుని అడిగాడు రాజమోహన్.

'అర్ధరాత్రి రోడ్డుమీద తిరగడం' అన్నాడు సి.ఐ.

తన పరిస్థితిని సి.ఐ.కి వివరించి చెప్పాడు. అంతటితో ఆగకుండా తన ఐడెంటిటీ కార్డ్ని, ఆఫీసుకు సంబంధించిన పత్రాలనూ ఆయనకు చూపించి –




'ఇప్పుడైనా నమ్ముతారా?' అని అడిగాడు.

'ఎప్పటికీ నమ్మంరా... నువ్వు అర్ధరాత్రి దొరికావ్. వీటన్నింటినీ నువ్వే క్రియేట్ చేసావంటాను. ఇవన్నీ మాయంచేసి, నిన్నో తీవ్రవాదిగా బుక్‌చేస్తాం... నువ్వేం చేస్తావ్? ఇక్కడంతా మా ఇష్టం' అంటూ శాడిస్టులా నవ్వాడు సి.ఐ.

మళ్లీ అంతా శృతికలిపారు.

'నేను మా ఇంటికి ఫోన్ చేస్తాను. మా ఫాదర్‌తో మాట్లాడండి. మీకే తెలుస్తుంది' అన్నాడు రాజమోహన్.

'సరే చెయ్' అన్నాడు సి.ఐ.

రాజమోహన్ జేబులోంచి సెల్‌ఫోన్ బయటకు తీసాడు.

'ఏం సెల్‌రా అది?' సి.ఐ. అడిగాడు దాన్ని చూడడంతోనే.

'సోనీ ఎరిక్‌సన్'

'బావుందిరా...' అంటూ రాజమోహన్ చేతిలోనుంచి తీసుకుని తన జేబులో వేసుకున్నాడు దాన్ని.

తర్వాత 'ఒరేయ్... వీడి జేబులు, సంచీ వెదకండిరా' అన్నాడు సి.ఐ.

వాళ్లు ముందుగా అతని జేబులో నుంచి పర్సును బయటకు తీసారు. అందులో రెండు వేల మూడొందల రూపాయలు, కొంత చిల్లర వున్నాయి.

'పర్సు బావుందిరా... ప్యూర్ లెదర్ పర్సు. నాక్కూడా లేదుగదురా... నీకెందుకు?' అంటూ ఆ డబ్బుతో పాటు పర్సును కూడా లాక్కున్నాడు సి.ఐ. దొర.

సార్... నేను మా వూరికి బస్సులో వెళ్లాలి' అన్నాడు రాజమోహన్ ఏడుపుమొహంతో.

'ఇదిగో... ఈ పది వుంచుకో...' అని ఓ పది రూపాయల నోటుని అతని మీదకు

విసిరాడు.

తర్వాత అతని బ్యాగ్ నుంచి బట్టలతో పాటు అతను మధురైలో కొన్న మీనాక్షీదేవి ఫొటో, ప్రసాదంగా కొన్న మూడు లడ్డూలనూ బయటకు తీసారు.

ఫొటో బావుందని ఓ దైవభక్తిగల కానిస్టేబుల్ తీసేసుకున్నాడు. మూడు లడ్లనూ సి.ఐ. అప్పటికప్పుడే తిని, నీళ్లుతాగి ఇంకో సిగరెట్ వెలిగించాడు.

'ఇది అన్యాయం సార్' అన్నాడు రాజమోహన్.

'ఇందులో అన్యాయం ఏముందిరా?... ఈ దేశం నిండా ఇంకా చాలా అన్యాయం వుంది. మా డ్యూటీ మేం చేసాం... అందరిలాగా రాత్రి పూట పెళ్లాంపక్కలో తొంగోకుండా అర్ధరాత్రిళ్లు డ్యూటీ చేసినందుకు మాక్కొంచెం లాభం వుండొద్దూ... ఇంకా నయం. ఇంతటితో సరిపోయింది. నిన్నో దొంగగానో, నక్సలైట్‌గానో బుక్‌చెయ్యలేదు. సంతోషించు. అదృష్టవంతుడివి' అంటూ అనవసరంగా మళ్లీ పెద్దగా నవ్వాడు సి.ఐ.

తిరిగి అంతా నవ్వారు అదేదో ఆనవాయితీ అయినట్లు.

పోలీసు వ్యవస్థను రద్దుచేస్తే ఎలా వుంటుందనే ఆలోచన వచ్చింది రాజమోహన్‌కి. అతను ఈ ఆలోచనలో వుండగానే సి.ఐ. వెళ్లిపోయాడు. మిగిలిన పోలీసులు మళ్లీ జీపుఎక్కి గస్తీ తిరగడానికి వెళ్లారు.

లారీలో వస్తున్నపుడు దారిలో ఎక్కడైనా దొంగలు లారీని ఆపి, తనని దోచుకుంటారేమోనని భయపడ్డాడు రాజమోహన్. కానీ అలా జరగలేదు. కానీ ఊహించని విధంగా ఇక్కడ తను దోచుకోబడ్డాడు.

కొంచెం తెల్లవారే వరకూ ఆ స్టేషన్ వరండాలోనే కూర్చుని ఉదయం ఆరున్నరవుతున్నపుడు ఇల్లుచేరాడు రాజమోహన్.

జరిగిందంతా ఇంట్లోవాళ్లకి చెప్పాడు. అంతా బాధపడ్డారు.

రాజమోహన్‌కి నిద్ర వస్తున్నట్లు అనిపించినా అవమానభారంతో నిద్రపోక ఆరోజు వచ్చిన న్యూస్‌పేపర్‌ని చూస్తూ కూర్చున్నాడు.

జిల్లా ఎడిషన్‌లో 'మేం మీ స్నేహితులం' అనే హెడ్డింగ్‌తో వున్న వార్త అతన్ని ఆకర్షించింది. వూరి పేరు కూడా అదే... తను లారీ దిగిన వూరు.

గబగబా చదవడం మొదలుపెట్టాడు.

ఆ రోజు ఉదయం జరిగిన రోటరీ క్లబ్ మీటింగ్‌లో సి.ఐ. పోలీస్ మైత్రీసంఘం గురించి మాట్లాడాడు. పోలీసులు ప్రజలకు స్నేహితులని, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణ కోసమే పోలీసులు వున్నారని, అందువల్ల ఎవరైనా సరే నిజంచెప్పి, పోలీసుల రక్షణ పొందండి... మీ సేవకై పోలీసులు ఎల్లవేళలా సిద్ధంగా వుంటారనీ...' పోలీస్ మైత్రీసంఘాన్ని ప్రారంభిస్తూ ప్రజలను ఉద్దేశించి చెప్పినట్లుగా అందులో రాసారు.

ఆ వార్తని చదవగానే రాజమోహన్ అప్పటికప్పుడు ఇంట్లోనుంచి అగ్గిపెట్టెను తీసుకువచ్చి, ఒక పుల్లగీసి ఆ న్యూస్‌పేపర్‌ని అంటించాడు.

పేపరంతా తగలబడిపోయే వరకూ చూస్తూ నిల్చున్నాడు. అధికారాన్ని స్వార్థానికి వాడుకునే పోలీసులను ఎదిరించలేని ఒక సామాన్య పౌరుడు ఆ పరిస్థితుల్లో ఏం చేస్తాడో రాజమోహన్ కూడా అదే చేసాడు. ●